

# తెలంగాణ ఎన్నికల పర్వం

## మినీ ఇండియా పఠాన్ ఎవరో!






పరిశ్రమలకు ఆలవాలం.. సుమారు 4 లక్షల మంది ఓటర్లు ఉన్న నియోజకవర్గం. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వలస వచ్చి ఉపాధి పొందుతున్న కార్మికులతో మినీ ఇండియాగా అభివర్ణించే ప్రాంతం. ఇక్రిశాట్, బీహెచ్ఈఎల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలకు కేంద్రం. రియల్ ఎస్టేట్ పెద్ద ఎత్తున అభివృద్ధి చెందిన ఖరీదైన భూములకు కేరాఫ్ అడ్రస్. విద్యావంతులు, వలస ప్రజలతో రాజకీయ చైతన్యం కలిగిన నియోజకవర్గం. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న పటాన్చెరు అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి కీలకంగా మారింది. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులకు తోడు బీఎస్పీ అభ్యర్థి కూడా గట్టిపోటీ ఇస్తుండడంతో ఇక్కడ ఎన్నిక అత్యంత హోరాహోరీగా సాగుతోంది.

**బీఆర్ఎస్ : గూడెం మహిపాల్ రెడ్డి**

గూడెం మహిపాల్రెడ్డి తాజా ఎన్నికల్లో మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించాలని ప్రయత్నిస్తున్నారు. గత పదేళ్లలో తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మహిపాల్రెడ్డి నేరుగా ఓటర్లకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోకు తోడు.. ఆయన సొంతంగా నవరత్న హామీల పేరుతో నియోజకవర్గ ప్రజలకు హామీలు ప్రకటించారు. ఊరికో అంబులెన్స్, మినీ స్టేడియాలు, కమ్యూనిటీ భవనాలు, యువత చదువుకు సహాయం, పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ తదితర హామీలతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. షెడ్యూలు వెలువడటానికి ఆరు నెలల ముందు నుంచే ఎన్నికలకు సిద్ధమవుతూ ప్రణాళిక రూపొందించుకున్నారు.

**బీజేపీ : నందీశ్వర్ గౌడ్**

బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న మాజీ ఎమ్మెల్యే టి.నందీశ్వర్గౌడ్.. బీజేపీ మూల సిద్ధాంతమైన హిందుత్వానికి తోడు బీసీ మంత్రాన్ని జోడించి అధికార పార్టీ దూకుడుకు కళ్లెం వేయాలని ప్రయత్నిస్తున్నారు. ముందు నుంచి బీసీ వాదాన్ని బలంగా వినిపించే నందీశ్వర్గౌడ్.. పార్టీ ప్రకటించిన బీసీ ముఖ్యమంత్రి హామీని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. బీజేపీకి సానుకూలంగా ఉంటారని భావిస్తున్న ఉత్తరాది ఓటర్లు తనకు మద్దతు పలుకుతారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రాంతంలోని విద్యావంతులు, కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువత కూడా బీజేపీ వైపే ఉంటారని భావిస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అవినీతి, భూ కబ్జాలకు పాల్పడ్డారని, అధికారాన్ని దుర్వినియోగం చేశారని ప్రచారం చేస్తున్నారు. ఆంధ్రా సెటిలర్ల ఓటర్లను ఆకట్టుకునేందుకు జనసేన అధినేత పవన్కల్యాణ్తో ప్రచార్ చేస్తున్నారు.

**కాంగ్రెస్ : కట్టా శ్రీనివాస్ గౌడ్**

పటాన్చెరు నియోజకవర్గంలో బలమైన క్యాడర్, ఓటుబ్యాంకు ఉన్న కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం సాధించేందుకు పోరాటం చేస్తోంది. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్పై పోటీ చేసిన యువ నాయకుడు, మేజర్ గ్రామ పంచాయతీ అమీన్పూర్ సర్పంచ్ కాట శ్రీనివాస్గౌడ్.. అధికార పార్టీ అభ్యర్థితో ఢీ అంటే ఢీ అన్నట్లుగా తలపడుతున్నారు. గతంలో ఓడిపోయిన సానుభూతి, ప్రభుత్వ వ్యతిరేకత కాంగ్రెస్కు కలిసి వచ్చే సానుకూల అంశాలుగా చెప్పుకొంటున్నారు వాస్తవానికి టికెట్ విషయంలోనే శ్రీనివాస్గౌడ్కు అనేక అవరోధాలు ఎదురయ్యాయి. బీఆర్ఎస్కు రాజీనామా చేసి కాంగ్రెస్లో చేరిన నీలం మధు ముదిరాజ్ రూపంలో టికెట్కు తీవ్ర పోటీ నెలకొనగా.. చివరికి అనేక నాటకీయ పరిణామాల మధ్య శ్రీనివాస్గౌడ్ టికెట్ తిరిగి దక్కించుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల వైఫల్యాలు, అధికార పార్టీ నేతల అవినీతి, కబ్జాలే తమ ప్రచార అస్త్రాలుగా శ్రీనివాస్గౌడ్ పేర్కొంటున్నారు. బహుముఖ పోటీలో ఎక్కడికక్కడ ఓట్లు చీలిపోవడం కాంగ్రెస్కు కలిసి వస్తుందని భావిస్తున్నారు.

**బీఎస్పీ నీలం మధు.. :** బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించి భంగపాటుకు గురై.. చివరికి బీఎస్పీ తరఫున బరిలోకి దిగిన నీలం మధు ముదిరాజ్ ప్రధాన పార్టీల అభ్యర్థులకు గుబులు పుట్టిస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్లో చేరిన నీలం మధును ఆ పార్టీ అభ్యర్థిగా ప్రకటించడం, చివరికి నాటకీయ పరిణామాల మధ్య శ్రీనివాస్గౌడ్ను ఖరారు చేయడం తెలిసిందే. దీంతో తనను మోసం చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ను ఓడించడమే లక్ష్యమని మధు ప్రకటించారు. ముదిరాజ్లకు అన్యాయం జరిగిందనే సామాజిక కోణాన్ని జోడించి బీఎస్పీ బహుజన వాదాన్ని వినిపిస్తూ ప్రచారం చేస్తున్నారు. అయితే నీలం మధు ఎవరి ఓట్లను చీలుస్తారన్నది అంతుపట్టడం లేదు. కానీ.. బీఆర్ఎస్, కాంగ్రెస్ వ్యతిరేక వర్గం ఓట్లతో తానే విజయం సాధిస్తానని మధు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్తో పొత్తు ప్రయత్నాలు విఫలం కావడంతో సీపీఎం కూడా అభ్యర్థిని నిలబెట్టింది. ట్రేడ్ యూనియన్ రాజకీయాల్లో సీనియర్ అయిన జొన్నలగడ్డ మల్లికార్జున్ ఆ పార్టీ తరఫున పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో లక్ష మంది కార్మికులు పనిచేస్తుండడంతో.. వారి సమస్యలే ఎజెండాగా ప్రచారం చేస్తున్నారు.

## గజ్వేల్ గండరగండడెవరో?





**బీఆర్ఎస్ : కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు :** వరుసగా రెండుసార్లు గజ్వేల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, ముఖ్యమంత్రి అయిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు. ఈసారి గెలిచి హ్యాట్రిక్ విజయాలు సాధించాలంటే మాత్రం ఒకప్పటి తన అనుంగు అనుచరుడు, ఇప్పుడు పార్టీ మారి గజ్వేల్ లో తన ప్రత్యర్థిగా బరిలో నిలిచిన ఈటల రాజేందర్ అడ్డంకి దాటాల్సిందే. గత రెండు ఎన్నికల్లో గజ్వేల్లో తనకు ప్రత్యర్థిగా ఉన్న, వంటేరు ప్రతాపరెడ్డి పార్టీ మారి బీఆర్ఎస్లో చేరటం తనకు ఇక్కడ ఎదురే లేదు అనుకుంటున్నా సమయంలో, ఈటల రూపంలో అనుకోని బలమైన ప్రత్యర్థి ఎదురయ్యారు. పదే, పదే నియోజకవర్గానికి రాలేని పరిస్థితిలో, వంటేరు ప్రతాప రెడ్డి పూర్తిగా ప్రచార బాధ్యతలు తన భుజాన ఎత్తుకున్నారు. తాము లక్ష మెజారిటీపై దృష్టి పెట్టామని చెబుతున్నరు,

**బీజేపీ : ఈటల రాజేందర్ :** ఈటల ముఖ్యంగా బీసీ ఓట్ల పైన, బీసీలలో ఎక్కువగా ఉన్న తన కమ్యూనిటీ ముదిరాజులపైన, బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేకతపై ఆధారపడి ప్రచారం చేస్తున్నారు. తనకు మద్దతుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా తూప్రాన్ బహిరంగ సభలో మాట్లాడారు. ప్రధానమంత్రి సభ తర్వాత, గజ్వేల్ లో పరిస్థితులు పూర్తిగా తనకు అనుకూలంగా మారతాయని ఈటల అంటున్నారు. ప్రభుత్వం, కేసీఆర్ పైన ఉన్న వ్యతిరేకతే తమకు లాభాన్ని చేకూరుస్తుందని ఈటల వర్గీయులు అంటున్నారు.

**కాంగ్రెస్ : తూంకుంట నర్సారెడ్డి :** కాంగ్రెస్ తరఫున బరిలో ఉన్న, తూముకుంట నర్సారెడ్డి ప్రభుత్వ వ్యతిరేక ఓట్లని ఎంతవరకు చీలుస్తారు అనేదానిపైన, కేసీఆర్కు ఈటల రాజేందర్ ఎంత గట్టి పోటీ ఇస్తారనే విషయం ఆధారపడి ఉంటుంది. కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డి మాత్రం కాంగ్రెస్ మేనిఫెస్టో ఆరు గ్యారంటీల పైన ప్రధానంగా ఆధారపడుతున్నారు. కేసీఆర్ గజ్వేల్లో కాకుండా వేరే నియోజక వర్గంలో సమావేశాలు నిర్వహిస్తున్నారని నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ కార్యకర్తలను ఆ సమావేశాలకు తీసుకొస్తున్నారని, తనపై దయ చూపాలని, ఇకపై నెలకు ఒక సారి వారితో ఉంటానని చెప్పారు. కార్యకర్తలను బతిమిలాడుకునే దుస్థితికి కేసీఆర్ వచ్చారని విమర్శించారు మల్లన్నసాగర్లో భూములు కోల్పోయిన వారికి ఇప్పటికీ ప్యాకేజీలు, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాగానే భూ నిర్వాసితులకు సరైన న్యాయం చేస్తామని అన్నారు.

## సంగారెడ్డి చాన్స్చ్చేదెవరికి?





**కాంగ్రెస్ : తూర్పు జయప్రకాశ్ రెడ్డి (జగ్గారెడ్డి)**

కాంగ్రెస్లో స్ట్రాంగ్ లీడర్గా ఉన్న తూర్పు జయప్రకాశ్ రెడ్డి(అలియాస్ జగ్గారెడ్డి) 3 సార్లు ఎమ్మెల్యేగా గెలవడం విశేషం. తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేకుండ తన సొంత క్యాడర్తో దూసుకుపోయాడు. 2004లో ఆయన తొలిసారి బీఆర్ఎస్ అభ్యర్థిగా . ఆ తర్వాత 2009, 2018లో మాత్రం కాంగ్రెస్ తరఫున గెలిచారు. ఇక తాజా పరిణామాలు ప్రకారం.. ఇప్పుడు జగ్గారెడ్డి బీఆర్ఎస్లో చేరే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తుండటంతో రాబోయే సంగారెడ్డి అసెంబ్లీ ఎన్నికలు ఆసక్తిగా మారాయి. ఎప్పుడు ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో తెలిక సంగారెడ్డిలో ఉత్కంఠత నెలకొంది.

**బీఆర్ఎస్ : చింతా ప్రభాకర్**

ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే అందుబాటులో ఉండి మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ సంగారెడ్డి అభ్యర్థి చింత ప్రభాకర్ కోరారు. కాంగ్రెస్కు ఓటేస్తే రాష్ట్రం అంధకారంలోకి వెళుతుందని, బీఆర్ఎస్ అధికారంలో ఉంటేనే ప్రజలు బాగుంటారన్నారు. నియోజకవర్గ ప్రజల ముఖం చూడని ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఎన్నికలు రాగానే ఊళ్ల మీద పడ్డారని ఆరోపించారు. మోసపూరిత హామీలతో ప్రజలను మభ్య పెట్టాలని చూస్తూ మళ్లీ ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. జగ్గారెడ్డి ప్రజలకు ఏం చేశారో నిలదీసి అడగాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్చెప్పే బూటకపు మాటలు నమ్మకుండా కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ను అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు. తనను గెలిపిస్తే సేవకుడిగా పనిచేస్తా నని, ప్రజల సమస్యను తన సమస్యగా భావించి పరిష్కరిస్తానని స్పష్టం చేశారు.

**బీజేపీ : పులిమామిడి రాజు :** బీఆర్ఎస్ కు ముదిరాజ్ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు రాజీనామా చేసి బీజేపీలో చేరి టిక్కెట్ దక్కించుఉన్నారు. నియోజకవర్గంలో ముదిరాజ్ కులస్తుల ఓటు బ్యాంకు సుమారు 40 శాతం ఉంది. పైగా ముదిరాజ్ సంఘం తరఫున రాజు కొన్నేళ్లుగా నియోజకవర్గంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. దీంతో సంఘం పెద్దలు, కుల ఓటర్లు ఆయన అభ్యర్థిత్వానికే మద్దతు తెలుపుతున్నారు. నిజానికి సంగారెడ్డి బీజేపీ అభ్యర్థిగా దేశ్ పాండే రాజేశ్వర్ రావుని ప్రకటించింది. కానీ నామినేషన్ వేసే సమయానికి ఆయనకు బదులు పులిమామిడి రాజుకి బీ–ఫారం ఇవ్వడంతో రాజేశ్వర్ కుతకుతలాడుతున్నారు,

## సిద్దిపేటలో గెలిచేదెవరో?

**బీఆర్ఎస్ : తన్నీర్ హరీశ్ రావు**

బీఆర్ఎస్ మేనిఫెస్టో చూస్తే ప్రతిపక్షాలకు దిమ్మతిరగాల్సిందే మంత్రి తన్నీర్ హరీశ్ రావు అంటూ ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అంటే నయవంచన, ఓట్ల కోసం మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. మాటలు, మూటలు, ముఠాలు, మంటలు ఇది కాంగ్రె స్ సంస్కృతి అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పాలనలో కరవు, కర్ఫ్యూలు లేకుండా రాష్ట్రం ప్రశాంతంగా ఉందని మంత్రి హరీశ్ రావు అన్నారు. కర్ణాటక నుంచి డబ్బులు సంచులు తెచ్చి గెలవాలని కాంగ్రెస్ కలలు కంటోందన్నారు. సీఎం కేసీఆర్ ఉన్నంత కాలం కాంగ్రెస్ ఆటలు సాగవన్నారు. ఆరు కిలోల బియ్యం, పగటి పూట కరెంట్ ఇస్తామని, తండాలను గ్రామపంచాయతీలు చేస్తామని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. కేసీఆర్ దిల్లీని గడగడలాడించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. తెలంగాణ ఏర్పడకపోతే కల్యాణ లక్ష్మి, రైతు బంధు, దళిత బంధు వంటి పథకాలు వచ్చేవా? అని మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు.

**బీజేపీ : దూది శ్రీకాంత్ రెడ్డి**

నేను బీఆర్ఎస్ పార్టీ దగ్గర కానీ,హరీష్ రావు నుండి కానీ ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని,ఎటువంటి ఆస్తులు కూడా తీసుకోలేదని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. నేను ఎవరికి అమ్ముడు పోలేదని, తనపై దుష్ప్రచారం చేసేవారు ఇప్పటికైనా మానుకోవాలని శ్రీకాంత్ కోరారు. నాపై ఎన్నో అక్రమ కేసులు నమోదు చేశారని శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. నేను భారతీయ జనతా పార్టీ కి (బీజేపీ) పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానని ఆయన తెలిపారు. సిద్ధిపేట లో బీజేపీ పార్టీ నుండి వాళ్ల స్వలాభం కోసం పోయి నామీద బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అన్నారు. నేను ఎవరి దగ్గర ఒక్కరూపాయి ఆశించనని,చివరిశ్వాస వరకు బీజేపీలో ఉంటానని ,పార్టీ కి మోసం చేయనని తెలిపారు.

**కాంగ్రెస్ : పూజల హరికృష్ణ**

గత హామీల అమల్లో బారాస ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పూజల హరికృష్ణ విమర్శించారు, అధికారంలోకి వచ్చేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్న కాంగ్రెస్ నేతలు.. పల్లెనుంచి పట్టణాల వరకు విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తున్నారు. హస్తం పార్టీకే పట్టంకట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బీఆర్ఎస్ సర్కార్ వైఫల్యాలను ఎండగడుతూనే.. 6గ్యారంటీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రచారం ముమ్మరం చేసిన అభ్యర్థులు.. ఒక్కసారి కాంగ్రెస్కు అవకాశం ఇవ్వాలని వేడుకుంటున్నారు.





## గుజరాత్ టైటాన్స్ కెప్టెన్గా గిల్

- హార్దిక్ విషయంలోనూ క్లారిటీ వచ్చేసింది
- శుభ్మన్ గిల్ను ఎంపిక చేసిన ఫ్రాంచైజీ
- ట్విటర్ వేదికగా వెల్లడించిన గుజరాత్ టైటాన్స్



అహ్మదాబాద్ : టీమిండియా నయా సంచలనం, సెంచరీల హీరో శుభ్మన్ గిల్ గుజరాత్ టైటాన్స్ జట్టు కెప్టెన్గా నియుక్తుడయ్యాడు. ఈ విషయాన్ని గుజరాత్ టైటాన్స్ జట్టు అధికారికంగా ప్రకటించింది. శుభ్మన్ గిల్ను తమ కొత్త కెప్టెన్గా నియమించిన విషయాన్ని గుజరాత్ టైటాన్స్ అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించింది. 2023 ఐపీఎల్ సీజన్లో లీడింగ్ రన్ స్కోరర్గా నిలిచిన శుభ్మన్ గిల్ 2024 ఐపీఎల్ సీజన్లో గుజరాత్ టైటాన్స్ జట్టును కెప్టెన్గా లీడ్ చేయనున్నాడు. ఆల్ క్యాష్ డీల్లో భాగంగా హార్దిక్ పాండ్యా పాత ఫ్రాంచైజీ ముంబయి ఇండియన్స్కు వెళ్లడంతో శుభ్మన్ గిల్ను కొత్త సారథిగా నియమిస్తున్నట్లు గుజరాత్ టైటాన్స్ వెల్లడించింది. ఇదే సమయంలో హార్దిక్ పాండ్యాకు వీడ్కోలు చెబుతూ కూడా ఒక ట్వీట్ చేసింది. హార్దిక్ పాండ్యా వెళ్లిపోవడంతో గుజరాత్ టైటాన్స్ కొత్త కెప్టెన్ ఎవరు అనే చర్చ జరిగింది. కేన్ విలియమ్సన్, మ్యాథ్యూ వేడ్, రషీద్ ఖాన్ వంటి స్టార్ ప్లేయర్లతో పాటు శుభ్మన్ గిల్ పేరు తెరపైకి వచ్చింది. అయితే, అనేక రకాలుగా ఆలోచించిన గుజరాత్ యాజమాన్యం చివరకు ప్రిన్స్ వైపే మొగ్గు చూపినట్లు తెలిసింది. 24 ఏళ్ల శుభ్మన్ గిల్ కోల్కతా నైట్ రైడర్స్ ద్వారా ఐపీఎల్లోకి ఎంట్రీ ఇచ్చాడు. 2018లో ఐపీఎల్లో అరంగేట్రం చేసిన గిల్ను గుజరాత్ టైటాన్స్ యాజమాన్యం 2021 వేలంలో ఏడు కోట్లకు కొనుగోలు చేసింది. తన బ్యాటింగ్ ద్వారా జట్టు కీలక సభ్యులలో ఒకరిగా మారాడు శుభ్మన్ గిల్. మెరుపు ఆరంభాలు అందిస్తూ 2022 సీజన్లో గుజరాత్ టైటాన్స్ జట్టు చాంపియన్గా నిలవడంలో తన వంతు పాత్ర పోషించాడు. గత సంవత్సరం కూడా బ్యాట్తో మెరుపులు మెరిపించిన గిల్ సీజన్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్గా నిలిచాడు. గుజరాత్ ఫైనల్ చేరడంలో కీలక పాత్ర వహించాడు. గత సీజన్లో గిల్ ఏకంగా మూడు సెంచరీలు బాదేశాడు. మరొక వైపు జట్టు కెప్టెన్గా హార్దిక్ పాండ్యా అద్భుతమైన విజయాలు అందించాడన్న గుజరాత్ టైటాన్స్ యాజమాన్యం ప్లేయర్లను, కోచింగ్ స్టాఫ్ను, మేనేజ్మెంట్ను ముందు ఉండి నడిపించాడని ప్రశంసించింది. గుజరాత్ టైటాన్స్ మొదటి కెప్టెన్గా ఒక సారి చాంపియన్గా నిలబెట్టడంతో పాటు మరొక సారి ఫైనల్ చేర్చాడని అధికారిక ప్రకటనలో పేర్కొంది. ముంబయి ఇండియన్స్కు తిరిగి వెళ్లాలన్న హార్దిక్ కోరికను గౌరవిస్తున్నట్లు ప్రకటించింది. భవిష్యత్తులో మరిన్ని ఘనతలు అందుకోవాలని ఆశిస్తున్నట్లు పేర్కొంది. 2022 సీజన్కు ముందు హార్దిక్ పాండ్యాను ముంబయి ఇండియన్స్ జట్టులో నుంచి రిలీజ్ చేసింది. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, బుమ్రా, పొలార్డ్లను అట్టిపెట్టుకున్న ముంబయి హార్దిక్ పాండ్యాను విడుదల చేసింది. దీనితో వేలంలో హార్దిక్ పాండ్యాను దక్కించుకున్న గుజరాత్ టైటాన్స్ ఏకంగా కెప్టెన్గా చేసింది. అయితే, సొంత గూటికి తిరిగి వెళ్లాలని హార్దిక్ నిర్ణయించుకోవడం, ఇదే సమయంలో ముంబయి కూడా ఆసక్తి చూపడంతో ట్రేడింగ్ విండో ద్వారా హార్దిక్ తిరిగి ముంబయి ఇండియన్స్ జట్టుతో చేరాడు.

### బ్యాట్పై పాలస్తీనా జెండాను ప్రదర్శించిన పాక్ క్రికెటర్


## మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా



కరాచీ : పాకిస్తాన్ వికెట్కీపర్ బ్యాటర్ ఆజం ఖాన్కు మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత పడింది. కరాచీలో జరుగుతున్న నేషనల్ టీ20 కప్ టోర్నమెంట్లో క్లాథింగ్, ఎక్విప్ మెంట్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను పీసీబీ ఈ జరిమానా విధించింది. ఆజం తన బ్యాట్పై పాలస్తీనా జెండా ప్రదర్శిం చడమే ఇందుకు కారణం. కరాచీ వైట్స్, లాహోర్ బ్లూస్ మధ్య మ్యాచ్లో ఈ ఘటన చోటు చేసుకుంది. తనకు జరిమానా విధించడంపై ఆజం ఖాన్ వివరణ ఇస్తూ, తన బ్యాట్లు అన్నింటిపైనా అటువంటి స్టిక్కర్లే ఉంటాయని అధికారులకు తెలిపాడు. మ్యాచ్ ఫీజులో కోత విధించడానికి ముందే బ్యాట్పై అటువటి ప్రదర్శన చేయవద్దని, అది ఐసీసీ ఆమోదించని లోగో (పాలస్తీనా జెండా) అని ఆజంను రిఫరీ హెచ్చరించాడు. ఈ మ్యాచే కాదు. ఇంతకు ముందటి రెండు మ్యాచ్లలోను అదే స్టిక్కర్ను ఆజం ఉపయోగించినట్లు తెలుస్తోంది. ఐసీసీ నిబంధనల క్లాథింగ్, ఎక్విప్మెంట్ రెగ్యులేషన్ ప్రకారం, ఆటగాళ్లు రాజకీయ, మతపరమైన, జాతి వివక్షకు సంబంధించిన కార్యకలాపాలు, కారణాలను ప్రదర్శించడం నిషిద్ధం.

## భారత జట్టు పాక్ రాకుంటే పరిహారం చెల్లించాలి

- పీసీబీ
- ఐసీసీకి పాక్ క్రికెట్ బోర్డు డిమాండ్
- ఈసారి పాక్లోనే చాంపియన్స్ ట్రోఫీ టోర్నీ నిర్వహణ
- సెక్యూరిటీ కారణాలతో టీమిండియా దూరమయ్యే అవకాశం




లాహోర్ : చాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్ ఆతిథ్య బాధ్యతలను పాకిస్తాన్కు అప్పగిస్తున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఇప్పటికే ప్రకటించింది. అయితే, దీనికి సంబంధించి ఇంకా అగ్రిమెంట్పై సంతకాలు కాలేదు. ఈ మెగా టోర్నీకి తామే ఆతిథ్యం ఇస్తామని చెబుతున్న పాక్ టీమిండియా కనుక టోర్నీలో పాల్గొనకుంటే పరిహారం చెల్లించవలసిందేనని ఐసీసీని డిమాండ్ చేస్తోంది. సెక్యూరిటీ పరంగా వ్యక్తమవుతున్న ఆందోళనలకు ఒక కొత్త పరిష్కారం సూచిస్తోంది. టీమిండియా ఆటగాళ్ల సెక్యూరిటీ బాధ్యతలు ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించాలని, పాక్ పోలీసులు సహకరిస్తారని తెలిపింది. పాకిస్తాన్లో చాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్ నిర్వహిస్తే భారత జట్టు టోర్నీకే దూరమయ్యే అవకాశం ఉంది. భద్రతపరమైన ఆందోళనలు వ్యక్తమవుతుండడంతో పాక్ వెళ్లేందుకు ఆటగాళ్లు ఇష్టపడకపోవచ్చని తెలుస్తోంది. బీసీసీఐ కూడా టీమిండియాను పాక్కు పంపే విషయంపై ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తోంది. గతంలో పాక్ ఆసియా కప్ టోర్నీ నిర్వహించగా టీమిండియా పాక్ వెళ్లేందుకు విముఖత వ్యక్తం చేసింది. దీనితో భారత జట్టు ఆడవలసిన మ్యాచ్లను శ్రీలంకలో నిర్వహించారు. ఈసారి మాత్రం అటువంటి ప్రత్యామ్నాయానికి అంగీకరించేందుకు పాక్ క్రికెట్ బోర్డు సిద్ధంగా లేదని సమాచారం. ఒకవేళ భారత జట్టు పాకిస్తాన్కు రాకుంటే ఐసీసీ తమకు పరిహారం చెల్లించవలసిందేనని పీసీబీ కోరుతోంది.

## దుబ్బాకలో త్రిముఖపోరు





**బీఆర్ఎస్ : కొత్త ప్రభాకర్ రెడ్డి**

మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గానికి లోక్సభలో ప్రాతినిధ్యం వహిస్తున్న కొత్త ప్రభాకరరెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ తరఫున దుబ్బాక నియోజకవర్గం నుంచి అభ్యర్థిగా బరిలోకి దిగారు. . దౌల్తాబాద్లోని సూరంపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో ఉన్న రెడ్డిపై కత్తితో దాడి ప్రధాన ప్రచార అస్త్రంగా మారింది. .. తమ పార్టీ ఎంపీని చంపాలని చూశారని, అయినప్పటికీ దేవుడి దయవల్ల ఆయన బతికి బయటపడ్డారన్నారు. ఇలాంటి హత్యా రాజకీయాలను సహించేది లేదంటూ, తెలంగాణ అద్భుత ప్రగతి సాధించిందన్నారు. ప్రతిపక్షాలు దాడులకు పాల్పడుతూ హింసను ప్రేరేపిస్తున్నాయని, మరోసారి బీఆర్ఎస్ను గెలిపించి ఇలాంటి శక్తులకు బుద్ధి చెప్పాలన్నారు. ఇక్కడ సిఎం ప్రచారంతో పోగా జోరందుకుంది.

**బీజేపీ : మాధవనేని రఘునందన్ రావు**

తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ నుంచి. తరువాత ఆయన బీజేపీకి మారారు. దుబ్బాక ఉపఎన్నికల్లో ఘన విజయం సాధించిన రఘునందన్ రావు రాజకీయ ప్రస్థానం మొదలైంది. ఒక తెలుగు దినపత్రికలో సుమారు 5 సంవత్సరాల పాటు న్యూస్ కంట్రిబ్యూటర్ గా పని చేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్య ఆఫ్ హైకోర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లో న్యాయవాదిగా ఎన్రోల్ చేసుకున్నారు. ప్రస్తుతం దుబ్బాకలో మరోమారు పోటీకి దిగారు. ఈ ఘటనతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కొత్త ప్రభాకర్ రెడ్డి తనకు మిత్రుడేనని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించే వ్యక్తిగా.. చట్టం తెలిసిన న్యాయవాదిగా.. కొత్త ప్రభాకర్ రెడ్డి మీద జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు.

**కాంగ్రెస్ : చెరుకు శ్రీనివాస్ రెడ్డి**

టీఆర్ఎస్కు గుడ్బై చెప్పి ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన చెరుకు ముత్యంరెడ్డి తనయుడు శ్రీనివాసరెడ్డి గత ఉపెన్నికల నుంచి కాంగ్రెస్లో కీలకంగా పనిచేస్తున్నారు. తాజా ఎన్నికలలో ఆయనకే కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని కట్టపెట్టింది కాంగ్రెస్ అధిష్టానం. ఇంటింటి ప్రచారంలో చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రజల కష్టసుఖాలను తెలుసుకున్నారు తెలంగాణలో రాబోయే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అందరూ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరుతున్నారు. . కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇంటికి ఐదు లక్షల సాయం.రైతులకు రెండు లక్షల రుణమాఫీ.ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే కనీస పెన్షన్ 5000 రూపాయలు.ఆడబిడ్డలకు రూ.500 లకే గ్యాస్ సిలిండర్.మొదటి ఏడాది రెండు లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామన్న హామీలతో ప్రచారం చేస్తున్నారు.

